భారత సమాఖ్య స్వభావం...

పాలనాధికారాల పంపిణి, కేంద్రీకరణను అనుసరించి ప్రభుత్వాలను సమాఖ్య లేదా ఏకకేంద్ర ప్రభుత్వాలుగా వర్గీకరిస్తారు. రాజ్యాంగం లోని 7వ షెడ్యూల్.. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల మధ్య అధికార పంపిణి గురించి తెలుపుతుంది. దీన్నిబట్టి మన దేశం సమాఖ్యతరహా ప్రభుత్వ విధానాన్ని అనుసరిస్తుందని పేర్కొనవచ్చు. భారతదేశ ప్రత్యేక పరిస్థితుల కారణంగా రాజ్యాంగ నిర్మాతలు రాజ్యాంగంలో సమాఖ్య లక్షణాలతో పాటు బలమైన ఏకకేంద్ర ప్రభుత్వ లక్షణాలను కూడా పొందుపరిచారు. అందువల్లే కె.సి.వేర్ 'భారతదేశాన్ని అర్ధసమాఖ్య'గా అభివర్ణించారు. 1935 చట్టం ద్వారా ఏర్పాటు చేసి న ఫెడరల్ వ్యవస్థ లక్షణాలను ఆధారం చేసుకుని కెనడా వంటి బలమైన కేంద్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు.

భారతదేశం సిద్ధాంతపరమైన సమాఖ్య కాదు. పరిపాలనా సౌలభ్యం కోసమే రాజ్యాంగం ద్వారా కేంద్రం, రాష్ట్రాల మధ్య అధికారాల పంపిణీ చేశారు. అందువల్ల రాజ్యాంగంలో ఎక్కడా సమాఖ్య అనే పదాన్ని చేర్చలేదు. రాష్ట్రాలకు విడిపోయే అవకాశం, స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకొనే అధికారం లేదు. భారతదేశాన్ని 'డిస్ట్రక్టబుల్ స్టేట్స్, అన్‌డిస్ట్రక్టబుల్ యూనియన్' (విభజించగల రాష్ట్రాలు, విభజించడానికి వీలులేని యూనియన్)గా ఏర్పాటు చేశారు. భారత స్వాతంత్ర్యోద్యమానికి నాయకత్వం వహించిన కాంగ్రెస్ కేంద్రీకరణ వైపు మొగ్గు చూపింది. కానీ మనదేశంలోని భిన్నత్వాన్ని, విశాల పరిపాలనా పరిధిని దృష్టిలో ఉంచుకొని సమాఖ్య లక్షణాలను కూడా అనుసరించాల్సి వచ్చింది. ప్రముఖ పరిపాలనవేత్త కె.సంతానం తన ప్రసిద్ధ గ్రంథమైన 'యూనియన్ స్టేట్ రిలేషన్స్'లో పేర్కొన్న... 'భారతదేశం సిద్ధాంతపరంగా సమాఖ్య విధానాన్ని అనుసరించాలని కోరుకున్నప్పటికీ అది ఆచరణలో మాత్రం ఏకకేంద్ర ప్రభుత్వంగానే వ్యవహరిస్తుంది.' అన్న అంశం గమనార్హం. మేరిస్ జోన్స్... భారతదేశంలో రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వంతో బేరమాడే అవకాశాలు, లక్షణాలున్నందున దీనిని బేరమాడే సమాఖ్యగా పేర్కొన్నారు. భారతదేశ విభజననాటి పరిస్థితులు మన రాజ్యాంగ నిర్మాతలపై బలమైన ప్రభావాన్ని చూపాయి. అందువల్ల డాక్టర్ అంబేద్కర్ భారత రాజ్యాంగం సాధారణ పరిస్థితులలో సమాఖ్యగాను, అత్యవసర పరిస్థితులలో ఏకకేంద్ర ప్రభుత్వంగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు.

సమాఖ్య లక్షణాలు..

అధికారాల పంపిణీ: జాతీయ, అంతర్జాతీయ ప్రాముఖ్యమున్న 99 అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి, ప్రాంతీయ ప్రాముఖ్యమున్న 61 అంశాలపై రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాలు కల్పించారు. ఉమ్మడి జాబితాలోని 52 అంశాలపై శాసనాలు రూపొందించే అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంది. ఏ జాబితాలో చేరని అవశిష్ట అధికారాలను కేంద్ర ప్రభుత్వానికి కేటాయించారు. అంటే సమాఖ్య ప్రభుత్వ ముఖ్య లక్షణమైన అధికారాల పంపిణీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య జరిగింది.

లిఖిత రాజ్యాంగం: రాజ్యాంగం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాల పంపిణీ జరిగినందున భారత రాజ్యాంగం లిఖిత పూర్వకమై ఉంది. లిఖిత రాజ్యాంగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ తమ పరిధికి కట్టుబడి ఉండేలా చూస్తుంది. మనది ప్రపంచంలోనే అత్యంత సుదీర్ఘ రాజ్యాంగం.

దృఢ రాజ్యాంగం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికార పరిధిలో, రాష్ట్రపతి పదవిలో ఏవైనా మార్పులు చేయాలంటే రాజ్యాంగాన్ని సవరించాలి. ఇలాంటి సందర్భంలో పార్లమెంటులో 2/3 వంతు మెజారిటీ ప్రత్యేక తీర్మానంతో పాటు దేశంలోని 1/2 వంతు రాష్ట్రాల ఆమోదం పొందాలి. దీన్ని బట్టి మన రాజ్యాంగం దృఢమైనది అని పేర్కొనవచ్చు.

రాజ్యాంగ ఆధిక్యత: అమెరికాలో సుప్రీంకోర్టు, బ్రిటన్‌లో పార్లమెంటు ఆధిక్యతను కలిగిఉంటాయి. మనదేశంలో రాజ్యాంగం సర్వోన్నతమైందిగా ఉంటుంది. రాజ్యాంగాన్ని సవరించే అధికారం పార్లమెంటుకు ఉన్నప్పటికీ, సవరించిన రాజ్యాంగానికైనా పార్లమెంటు కట్టుబడి ఉండాలి.

స్వతంత్ర ప్రతిపత్తి గల న్యాయ వ్యవస్థ: కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య, అదేవిధంగా రాష్ట్రాలకు, రాష్ట్రాలకు మధ్య తలెత్తే వివాదాలను పరిష్కరించే సుప్రీం కోర్టు స్వతంత్ర ప్రతిపత్తిని కలిగిఉంటుంది. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల శాసనాలు రాజ్యాంగ పరిధిని ఉల్లంఘించకుండా చూసే బాధ్యత సర్వోన్నత న్యాయస్థానానిదే.

రెండు స్థాయిల్లో ప్రభుత్వం: జాతీయ ప్రాముఖ్యమున్న అంశాల పాలనకు కేంద్ర ప్రభుత్వం, ప్రాంతీయ ప్రాముఖ్యమున్న అంశాల పాలన కోసం రాష్ట్ర ప్రభుత్వాలు ఏకకాలంలో రెండు స్థాయిల్లో రాజకీయ వ్యవస్థలు రాజ్యాంగ పరిధికి లోబడి పనిచేస్తాయి.

కేంద్ర శాసనసభలో రాష్ట్రాలకు ప్రాతినిధ్యం: పార్లమెంటులోని ఎగువ సభ(రాజ్యసభ)లో రాష్ట్రాలకు ప్రాతినిధ్యం కల్పించారు. అన్ని రాష్ట్రాలకు సమానమైన ప్రాతినిధ్యం లేకపోయినప్పటికీ రాష్ట్రాల జనాభా ఆధారంగానే సభ్యుల సంఖ్య నిర్ణయిస్తారు.

ఏకకేంద్ర లక్షణాలు

- రాజ్యాంగం ద్వారా కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికారాల పంపిణీ జరిగినప్పటికీ కేంద్రానికి ఎక్కువ అధికారాలు కల్పించడం ద్వారా బలమైన కేంద్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు.
- అమెరికా వంటి సమాఖ్య ప్రభుత్వాల్లో కేంద్రానికి, రాష్ట్రాలకు విడివిడిగా రాజ్యాంగాలుండగా మనదేశంలో మాత్రం ఒకే రా

జ్యాంగం ఉంది.

- భారతదేశం ఒకే పౌరసత్వాన్ని ఇస్తుంది.
- రాష్ట్రాల జాబితాపై శాసనం చేసే అధికారం, రాష్ట్రాల్లో జోక్యం చేసుకొనే, ఆధిపత్యం చెలాయించే అధికారం కేంద్రానికి ఉంటుంది.
- మనదేశంలో కేంద్రానికి, రాష్ట్రాలకు ప్రత్యేక న్యాయవ్యవస్థలున్నప్పటికీ మొత్తం న్యాయవ్యవస్థ ఏకీకృతమై ఉంటుంది.
- రాజ్యాంగంలోని అత్యవసర అధికారాలు కేంద్ర ప్రభుత్వ ఆధిపత్యాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి.
- రాష్ట్రాల పరిపాలనలో కీలకపాత్ర పోషించే గవర్నర్ వ్యవస్థ కేంద్ర ప్రభుత్వానికి లోబడే పనిచేస్తుంది.
- రాష్ట్రాల్లోని జిల్లాల పరిపాలనలో కీలకపాత్రను పోషించే అఖిల భారత సర్వీసుల ఉద్యోగులను యూపీఎస్సీ నియమిస్తుంది.
- కాగ్, కేంద్ర ఎన్నికల కమిషన్, ఫైనాన్స్ కమిషన్ వంటివి రాజ్యాంగబద్ధమైన సంస్థలైనప్పటికీ ఇవి కేంద్రం అధీనంలోనే పనిచేస్తాయి.
- జి.ఎన్. జోషి, జస్టిస్ కె.పి. ముఖర్జీ వంటివారు భారత దేశంలో అధికార కేంద్రీకృత ధోరణి ఎక్కువగా ఉండటం, రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి లేకపోవడం వల్ల మనది ఏమాత్రం సమాఖ్య ప్రభుత్వం కాదని పేర్కొన్నారు.

ప్రాక్టీస్ ప్రశ్నలు...

1. సమాఖ్య ప్రభుత్వాన్ని నిర్ణయించే అంశం?

ఎ) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలు

బి) శాసన, కార్యనిర్వాహక శాఖల మధ్య సంబంధాలు

సి) ప్రభుత్వంలోని శాసన, కార్యనిర్వాహక, న్యాయశాఖల మధ్య సంబంధాలు

డి) రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాల మధ్య సంబంధాలు

2. భారత రాజ్యాంగం కిందివాటిలో దేనిని సృష్టించింది?

ఎ) బలమైన కేంద్రం బి) బలమైన రాష్ట్రాలు

సి) కేంద్రం, రాష్ట్రాలు సమాన స్థాయిని కలిగి ఉండటం

డి) సాధారణ పరిస్థితుల్లో రాష్ట్రాలు బలంగాను, అత్యవసర పరిస్థితుల్లో బలమైన కేంద్రం

3. సమాఖ్య విధానాన్ని అనుసరించి భారతదేశంలో కేంద్రం, రాష్ట్రాల మధ్య ఏ అధికారాలను విభజించలేదు?

ఎ) శాసన పరమైనవి బి)పరిపాలనా పరమైనవి

సి) ఆర్థిక పరమైనవి డి) న్యాయపరమైనవి

4. భారత రాజ్యాంగంలోని మొదటి అధికరణ మన దేశాన్ని ఏమని ప్రకటిస్తుంది?

ఎ) కేంద్రీకృత ధోరణి గల సమాఖ్య

బి) అర్ధ సమాఖ్య సి) సహకార సమాఖ్య

డి) రాష్ట్రాల కలయిక

5. ఏకకేంద్ర వ్యవస్థను గురించి వర్ణించే అంశం ఏది?

ఎ) ప్రాదేశిక విభాగాలు, కేంద్ర ప్రభుత్వానికి అధీన ఏజన్సీలుగా ఉంటాయి

బి) ప్రాదేశిక విభాగానికి కేంద్ర ప్రభుత్వంలో సమన్వయం, హోదా ఉంటుంది

సి) రాష్ట్రాల హక్కులతో జాతీయ సమైక్యత కాపాడుతుంది

డి) ప్రభుత్వ విధులు ఒకేవ్యక్తి చేతిలో ఉంటాయి

6. భారతదేశంలో రాష్ట్రాల సరిహద్దులను మార్చే అధికారం ఎవరికి ఉంటుంది?

ఎ) సుప్రీంకోర్టు బి) రాష్ట్రపతి

సి) పార్లమెంటు డి) ప్రధానమంత్రి

7. భారత రాజ్యాంగం, కిందివాటిలో ఏ దేశ రాజ్యాంగం నుంచి 'యూనియన్ ఆఫ్ స్టేట్స్' భావనను గ్రహించింది?

ఎ) కెనడా బి) యూఎస్ఏ

సి) పూర్వపు సోవియట్ యూనియన్

డి) జర్మనీ

జవాబులు	1	2	3	4	5	6	7
	A	A	D	D	A	C	A

జాతీయ సమైక్యతను, రాష్ట్రాల హక్కులను సమన్వయ పరిచే రాజకీయ సాధనమే సమాఖ్య ప్రభుత్వం. 1935 భారత ప్రభుత్వ చట్టం ద్వారా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాల పంపిణీని ఆధారంగా చేసుకుని కెనడా సమాఖ్య స్ఫూర్తితో మన రాజ్యాంగ నిర్మాతలు భారతదేశాన్ని సమాఖ్య ప్రభుత్వంగా రూపొందించారు.

మనదేశ విశాల పరిపాలనా పరిధి, పాలనా సౌలభ్యం కోసం సమాఖ్య వ్యవస్థగా రూపొందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. భారత దేశంలోని భిన్న పరిస్థితులు కూడా సమాఖ్య వ్యవస్థను ఏర్పరచడానికి ప్రధాన కారణంగా పేర్కొనవచ్చు. భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించాలంటే బలమైన కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. అందువల్ల మన రాజ్యాంగం సాధారణ పరిస్థితుల్లో సమాఖ్యగా, అత్యవసర పరిస్థితుల్లో ఏకకేంద్ర ప్రభుత్వంగా వ్యవహరిస్తుందని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేర్కొంటే భారతదేశం ఒక అర్ధ సమాఖ్యగా కె.సి. వేర్ అనే పండి తుడు వ్యాఖ్యానించారు.

1. భారతదేశాన్ని అర్ధ సమాఖ్యగా వర్ణించింది? (గ్రూప్-II, 2003)
   ఎ) ఐవర్ జెన్నింగ్స్ బి) ఎ.సి. బెనర్జీ
   సి) కె.సి. వేర్ డి) ఎన్.ఎ. పాల్కీవాలా

సమాధానం: సి

వివరణ: భారతదేశం బలమైన ఏకకేంద్ర లక్షణాలు గల బలహీనమైన సమాఖ్యయే.. కానీ బలమైన సమాఖ్య లక్షణాలున్న బలహీనమైన కేంద్రం కాదు. అందువల్ల దేశాన్ని అర్ధ సమాఖ్యగా కె.సి.వేర్ వర్ణించారు.

2. భారతదేశం వాస్తవంగా ఒక?
   ఎ) వాస్తవిక సమాఖ్య వ్యవస్థ
   బి) కేంద్రీకృత ధోరణి గల సమాఖ్య
   సి) అర్ధ సమాఖ్య డి) రాష్ట్రాల కలయిక

సమాధానం: డి

వివరణ: మన రాజ్యాంగంలో ఎక్కడ కూడా సమాఖ్య అనే పదాన్ని ప్రస్తావించలేదు. కేంద్ర ప్రభుత్వం, సమాఖ్య అనే పదాలకు బదులుగా యూనియన్ అనే పదాన్ని వినియోగించారు. రాజ్యాంగంలోని ఒకటో అధికరణ మనదేశాన్ని రాష్ట్రాల కలయికగా మాత్రమే పేర్కొంటుంది.

3. భారత సమాఖ్య ఏ దేశ వ్యవస్థను పోలి ఉంది?(గ్రూప్-II, 2003)
   ఎ) యూఎస్ఏ బి) కెనడా
   సి) ఫ్రాన్స్ డి) చైనా

సమాధానం: బి

వివరణ: మన దేశం అనుసరించే సమాఖ్య విధానం కెనడాను పోలి ఉంటుంది. అవశిష్ట అధికారాలను కేంద్రానికి కేటాయించి బలమైన కేంద్ర ప్రభుత్వాన్ని కలిగి ఉండే సమాఖ్య విధానాన్ని మనదేశం అనుసరిస్తుంది. అందువల్ల కెనడాలో మాదిరిగానే సమాఖ్యకు బదులుగా యూనియన్ అనే పదాన్ని వినియోగించారు.

4. రాష్ట్రాలకు సూచనలిచ్చే కేంద్ర భావనను భారత రాజ్యాంగ నిర్మాతలు కింది వాటిలో దేని నుంచి గ్రహించారు? (సివిల్స్-2003)
   ఎ) భారత ప్రభుత్వ చట్టం 1935
   బి) అమెరికా రాజ్యాంగం
   సి) సోవియట్ రాజ్యాంగం
   డి) ఆస్ట్రేలియన్ రాజ్యాంగం

సమాధానం: ఎ

వివరణ: రాజ్యాంగంలో 11వ భాగంలోని కేంద్ర రాష్ట్ర సంబంధాలు అనే అంశాన్ని 1935 భారత ప్రభుత్వ చట్టం నుంచి గ్రహించారు. ఈ చట్టాన్ని అనుసరించి పరిపాలన పరంగా కేంద్రం రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేయవచ్చు.

5. భారత యూనియన్ నుంచి రాష్ట్రం వేర్పాటు ను ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా నిషేధించారు? (సివిల్స్- 2002)
   ఎ) 16వ సవరణ చట్టం 1963
   బి) 22వ సవరణ చట్టం 1969
   సి) 29వ సవరణ చట్టం 1972
   డి) 35వ సవరణ చట్టం 1974

సమాధానం: ఎ

వివరణ: భారతదేశం సూత్రబద్ధమైన లేదా సిద్ధాంత పరమైన సమాఖ్య కాదని అంబేద్కర్ వర్ణించారంటే మనదేశం నుంచి విడిపోయే అధికారం ఏ రాష్ట్రానికి కూడా లేదు. అంటే మన దేశాన్ని విభాజిత రాష్ట్రాలు గల అవిభాజ్యమైన యూనియన్‌గా పేర్కొనవచ్చు. 1963లో 16వ రాజ్యాంగ సవరణ ద్వారా మరోసారి అధికారికంగా ఈ అంశాన్ని వ్యక్తీకరించారు.

6. భిన్నత్వంలో ఏకత్వం, వికేంద్రీకరణతో కేంద్రీకరణను స్థానిక వాదంతో జాతీయ వాదాన్ని సాధించడానికి ఫెడరలిజం ప్రయత్నిస్తుంది అని చెప్పింది? (సివిల్స్-2002)
   ఎ) కె.సి. వేర్ బి) డబ్ల్యు.హెచ్. రైకర్
   సి) డానియెల్ జి. ఎలజర్ డి) ఏ.వి. డైసీ

సమాధానం: డి

వివరణ: సమాఖ్య వ్యవస్థ అనేది భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించడానికి, జాతీయవాదాన్ని బలపరచడానికి, జాతీయ సమైక్యతను, రాష్ట్రాల హక్కులను సమన్వయ పరిచే రాజకీయ సాధనంగా పనిచేస్తుందని బ్రిటన్‌కు చెందిన ఎ.వి. డైసీ పేర్కొన్నారు.

7. ఏకకేంద్ర ప్రభుత్వ వ్యవస్థలో స్థానిక సంస్థలకున్న అధికారం? (సివిల్స్-1999)
   ఎ) వాస్తవికమైంది
   బి) కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రహించింది
   సి) రాజ్యాంగం నుంచి గ్రహించింది

డి) ప్రజల నుంచి గ్రహించింది

సమాధానం: బి

వివరణ: సమాఖ్య ప్రభుత్వంలో మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ తమ అధికారాలను రాజ్యాంగం నుంచి గ్రహిస్తాయి. ఏకకేంద్ర ప్రభుత్వంలో పాలనా అధికారాలు మొత్తం కేంద్రానికి చెంది ఉంటా యి. అందువల్ల స్థానిక ప్రభుత్వాలు అధికారాలను కేంద్రం నుంచి గ్రహిస్తాయి.

8. భారత రాజ్యాంగంలో ఫెడరల్ అనే పదం? (సివిల్స్-1999)

ఎ) ప్రవేశికలో కనిపిస్తుంది

బి) రాజ్యాంగంలోని IIIవ భాగంలో కనిపిస్తుంది

సి) 368 అనుచ్ఛేదంలో కనిపిస్తుంది

డి) ఎక్కడా ప్రస్తావించలేదు

సమాధానం: డి

వివరణ: భారత రాజ్యాంగంలో ఫెడరల్ అనే ప్రస్తావనను ఏ భాగం లో కూడా పేర్కొనలేదు. ఫెడరల్‌కు బదులుగా యూనియన్ అనే పదాన్ని మాత్రమే ప్రస్తావించారు.

9. కింది ఫెడరల్ సూత్రాల్లో భారతీయ ఫెడరేషన్‌లో కనిపించనివి? (సివిల్స్-1998)

1) ఫెడరల్, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య న్యాయ వ్యవస్థను విడ గొట్టడం

2) తమ శాసనాలను, విధులను నిర్వహించడానికి ఫెడరల్ రాష్ట్ర ప్రభుత్వాలకు సొంత అధికారాలుండటం

3) తన ఇష్టంతో యూనియన్ నుంచి విడిపోయిన ఏదైనా రాష్ట్రాల వల్ల యూనియన్ విచ్ఛిన్నమవడం

4) కొత్త రాష్ట్రాలను ఏర్పరచడం ద్వారా ఫెడరల్ ప్రభుత్వం భారత యూనియన్ మ్యాప్‌ను తిరిగి గీయడం

ఎ) 1, 2, బి) 2, 3,4

సి) 1,2 డి) 3, 4

సమాధానం: సి

వివరణ: అమెరికా సమాఖ్యలో మాదిరిగా భారతదేశంలో పూర్తిగా విభాజిత న్యాయ వ్యవస్థలు లేవు. మన దేశంలో ఏకీకృత న్యాయ వ్యవస్థ మాత్రమే ఉంది. అదేవిధంగా మన సమాఖ్య నుంచి విడి పోయే అధికారం ఏ రాష్ట్రానికీ లేదు. ఒప్పందం ద్వారా ఏర్పడిన అమె రికా సమాఖ్య నుంచి విడిపోయే అధికారం అక్కడి రాష్ట్రాలకు ఉంది.

10. 1935 చట్టం ద్వారా ఏర్పాటైన ఫెడరేషన్‌లో అవశిష్ట అధికారాలను ఎవరికి అప్పగిం చారు? (సివిల్స్-1997)

ఎ) ఫెడరల్ శాసన వ్యవస్థ

బి) ప్రొవిన్షియల్ శాసన వ్యవస్థ

సి) గవర్నర్ జనరల్

డి) ప్రొవిన్షియల్ గవర్నర్

సమాధానం: సి

వివరణ: 1935 చట్టం అవశిష్ట అధికారాలను గవర్నర్ జనరల్‌కు అప్ప గించడం వల్ల 1950 భారత రాజ్యాంగం అవశిష్ట అధికారాలను కేంద్ర ప్రభుత్వానికి కేటాయించింది.

11. కొత్త రాష్ట్రాల ఏర్పాటుకు సంబంధించి భారత రాజ్యాంగంలోని నిబంధనలను ఏ విధంగా సవరించవచ్చు? (సివిల్స్-1997)

ఎ) పార్లమెంట్‌కు మెజారిటీ సభ్యులు హాజరై, వారిలో 2/3 వంతు మెజారిటీతో ఆమో దించడం

బి) మెజారిటీ రాష్ట్ర శాసన వ్యవస్థలు ఆమోదించిన పార్లమెంట్ తీర్మానం

సి) పార్లమెంట్ ఒక్కొక్క సభ సాధారణ మెజారిటీ

డి) పార్లమెంట్ ఒక్కొక్క సభలో 3/4 వంతు మెజారిటీతో

సమాధానం: సి

వివరణ: భారతదేశంలో రాష్ట్రాల పునర్‌వ్యవస్థీకరణ, కొత్త రాష్ట్రాల ఏర్పాటును సాధారణ మెజారిటీ తీర్మానంతో చేయవచ్చు. రాష్ట్ర శాసన సభల అభిప్రాయాలను తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం లేదు.

12. భారత రాజ్యాంగంలో అవశిష్ట అధికారాలకు సంబంధించి కింది వాటిలో సరైంది? (సివిల్స్-1996)

1) అవశిష్ట అధికారాలు కేంద్ర పార్లమెంట్‌కు అప్పగించారు

2) అవశిష్ట అధికారాల విషయంలో భారత్ ఆస్ట్రేలియా రాజ్యాం గాన్ని అనుసరించింది

3) నిర్ణీత విషయం, అవశిష్ట అధికారం కిందికి వస్తుందా, రాదా అనే విషయంలో తుది నిర్ణయం పార్లమెంట్‌దే

4) 1935 చట్టం అవశిష్ట అధికారాలను గవర్నర్ జనరల్‌కు అప్ప గించింది

ఎ) 1, 2, 3 బి) 2, 3

సి) 1, 4 డి) 3, 4

సమాధానం: సి

వివరణ: అవశిష్ట అధికారాల విషయంలో భారతదేశం కెనడాను అను సరించింది. అదేవిధంగా అవశిష్ట అధికారాలపై తుది నిర్ణయం తీసు కొనే అధికారం మన దేశంలో సుప్రీంకోర్టుకు ఉంది.

13. భారత్, అమెరికా సమాఖ్యవాదంతో సంబంధమున్న అంశం? (సివిల్స్-1996)

1) రాజ్యాంగంలో ఉమ్మడి జాబితాను పేర్కొనడం

2) లిఖిత రాజ్యాంగం

3) కేంద్రానికి రాష్ట్రాలకు మధ్య అధికారాల విభజన

4) అవశిష్ట అధికారాలు రాష్ట్రాలకు ఉండటం

ఎ) 1, 2, 3 బి) 1, 2, 4

సి) 2, 3 డి) 1, 3

సమాధానం: సి

వివరణ: అమెరికా రాజ్యాంగంలో ఉమ్మడి జాబితాను పేర్కొనలేదు. మన రాజ్యాంగంలో ప్రస్తావించారు. లిఖిత రాజ్యాంగం, అధికారాల విభజన విషయంలో రెండు రాజ్యాంగాలూ ఒకే లక్షణాన్ని కలిగి ఉన్నా యి. అవశిష్ట అధికారాలను అమెరికాలో రాష్ట్రాలకు, భారత్‌లో కేంద్రా నికి కేటాయించారు.